# సాక్షి ప్రకాశం

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024




**ఆశీర్వదించండి..అండగా ఉంటా**

వైఎస్సార్ సీపీలో ప్రతి కార్యకర్త తన కుటుంబ సభ్యుడేనని వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే అండగా ఉంటానని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు.

- 8లో..



**రైల్వే అభివృద్ధి పనులు జాతికి అంకితం**

అమృత్ భారత్ స్కీం కింద మార్కాపురం రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పీఎం మోదీ జాతికి అంకితం చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/26

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### మెగా లోక్ అదాలత్ 16వ తేదీకి వాయిదా

ఒంగోలు: మార్చి 9వ తేదీ జరగాల్సిన మెగా లోక్ అదాలత్ వాయిదా పడినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా లోక్ అదాలత్ మార్చి 16వ తేదీ నిర్వహిస్తారన్నారు.

### కోల్డ్ స్టోరేజిలో పొగాకు నిల్వకు అనుమతి తప్పనిసరి

- ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని కోల్డ్ స్టోరేజ్ మేనేజర్లతో బోర్డు సెక్రటరీ వేణుగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న బోర్డు సెక్రటరీ, మేనేజర్ దివి వేణుగోపాల్

ఒంగోలు సెంట్రల్: కోల్డ్ స్టోరేజ్‌లలో పొగాకు బేళ్లను నిల్వ చేయాలంటే పొగాకు బోర్డు అనుమతి పత్రం (టి-పత్రం) తప్పనిసరి అని బోర్డు సెక్రటరీ, మేనేజర్ దివి వేణుగోపాల్ అన్నారు. ఒంగోలు బోర్డు కార్యాలయంలో సోమవారం ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని కోల్డ్ స్టోరేజ్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ, మేనేజర్ దివి వేణుగోపాల్ మాట్లాడుతూ పొగాకు రైతులు తమ పొగాకు బేళ్లను కోల్డ్ స్టోరేజ్‌ల్లో నిల్వ చేయాలంటే కచ్చితంగా పొగాకు బోర్డు సిబ్బంది నుంచి ట్రాన్సిట్ నోట్ (టి-నోట్), రైతుల టీబీజీఆర్ వివరాలు తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు. అనుమానాస్పదంగా, అనధికారికంగా బేళ్లను నిల్వ చేస్తే బోర్డు, లేదా విజిలెన్స్ వారికి తెలియజేయాలని సూచించారు. కోల్డ్ స్టోరేజ్ నుంచి బోర్డుకు బేళ్లను తీసుకెళ్లేటప్పుడు కూడా టీ నోట్ లేకుండా డెలివరీ చేయవద్దని సూచించారు. బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు, విజిలెన్స్ ఓఎస్‌డీ రామారావు, ఒంగోలు-1, 2, వెల్లంపల్లి, కందుకూరు 1, 2, టంగుటూరు, పొదిలి వేలం నిర్వహణాధికారులు పాల్గొన్నారు.

### వ్యక్తిని కొట్టారని ఎస్సై, కానిస్టేబుళ్లకు మూడేళ్ల జైలు

ఒంగోలు: చిరు వివాదాన్ని రాజీ చేసుకున్నారని చెప్పేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఓ వ్యక్తిని కొట్టి గాయపరిచిన కేసులో ఎస్సై బొలగాని జగన్‌మోహన్‌రావు (ప్రస్తుతం తిరుపతి సీసీఎస్), కానిస్టేబుల్ కాసా కిరణ్‌కుమార్ (ప్రస్తుతం చీరాల ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్)లకు మూడేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.23 వేల జరిమానా విధిస్తూ 8వ అదనపు జిల్లా జడ్జి డి.అమ్మన్నరాజా సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బాపట్ల జిల్లా జె.పంగులూరు పోలీసుస్టేషన్‌లో 2016లో ఎస్సైగా జగన్‌మోహన్‌రావు, కానిస్టేబుల్‌గా కాసా కిరణ్ కుమార్‌లు విధులు నిర్వహిస్తున్నారు. అదే పోలీసు స్టేషన్ పరిధిలో కోటపాడు గ్రామానికి చెందిన నేలపాటి ఇమ్మానుయేలు, మండా వెంకటేశ్వర్లు మధ్య రూ.2 వేలు కూలి డబ్బులకు సంబంధించి వివాదంలో ఘర్షణ పడి గాయపడ్డారు. దీంతో ఇరువురు అద్దంకి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని ఇద్దరి మధ్య రాజీ కుదిర్చారు. గోళ్ల మూడి తిరుపాలు, మరికొంతమంది పెద్దలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఇద్దరూ రాజీ కుదుర్చుకున్న విషయాన్ని ఎస్సైకి వివరించారు. ఈ విషయంలో ఎస్సై ఆగ్రహించి పరస్పర ఫిర్యాదులు చేసుకున్నవారిలో ఒకరిని కొడుతుండడంతో తిరుపాలు అభ్యంతరం తెలిపాడు. దీంతో ఆగ్రహించిన ఎస్సై, కానిస్టేబుల్‌లు అభ్యంతరం వ్యక్తం చేసిన తిరుపాలు చెంపలు వాయించడంతోపాటు చొక్కా పట్టుకుని ఈడ్చుకుంటూ రబ్బరు ట్యూబుతో కొట్టి వదిలేశారు. దీంతో గాయపడిన తిరుపాలు నేరుగా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. దీనిపై ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎం.బాలసుందరరావు (ప్రస్తుతం మార్కాపురం డీఎస్పీ) విచారణ జరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దీనిపై నేరం నిరూపణ కావడంతో ఎస్సై బొలగాని జగన్‌మోహన్‌రావు, కానిస్టేబుల్ కాసా కిరణ్‌కుమార్‌లకు ఐపీసీ సెక్షన్ 324 కింద 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో 3 నెలల సాధారణ జైలుశిక్ష, ఐపీసీ సెక్షన్ 506 కింద రెండు సంవత్సరాల జైలుశిక్ష, రూ.3 వేలు జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో 2 నెలల సాధారణ జైలుశిక్ష, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద 3 సంవత్సరాల జైలుశిక్ష, పదివేలు జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో 3 నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ 7వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి జడ్జి, 8వ అదనపు జిల్లా జడ్జి డి.అమ్మన్నరాజా తీర్పునిచ్చారు. ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలు చేయాలని, నిందితులు ప్రతి ఒక్కరూ రూ.23 వేలు జరిమానా చెల్లించాలని తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.శ్రీనివాసమూర్తి వాదించారు.

# సేనలో డ్రామచర్ల

టీడీపీ-జనసేన ఉమ్మడి తొలి జాబితాలో ఒక్కస్థానం దక్కక షాక్‌లో ఉన్న జనసైనికులకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత దామచర్ల జనార్దన్ షాక్‌ల మీద..షాక్‌లు ఇస్తున్నారు. ఒంగోలు సీటును ఆశించిన జనసేన నేత రియాజ్‌పై ప్రత్యర్థి వర్గాన్ని ప్రోత్సహిస్తూ విభేదాలు సృష్టిస్తున్నారని, అలాగే గిద్దలూరులో సైతం ఆయన జోక్యం చేసుకుంటూ నేతల మధ్య చిచ్చు రగులుస్తున్నారని జనసైనికులు దామచర్ల తీరుపై మండిపడుతున్నారు. జనసేనలో దామచర్ల డ్రామా జిల్లా పొలిటికల్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

- ఒంగోలు సీటు ఆశించి భంగపడిన రియాజ్
- ఫోన్ స్విచాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి
- అరుణ వర్గానికి దామచర్ల మద్దతు
- అరుణ తీరుపై నాదెండ్లకు రియాజ్ ఫిర్యాదు
- గిద్దలూరు, దర్శిల్లోనూ దామచర్ల జోక్యం
- మార్కాపురం తనకు ఇవ్వాలంటున్న విశ్వనాథ్
- జిల్లా కార్యాలయం ఎత్తేయాలన్న ఆలోచనలో రియాజ్



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ-జనసేన ఉమ్మడి తొలి జాబితాలో ఒక్కసీటు దక్కకపోవడంతో జిల్లా జనసేనలో నైరాశ్యం నెలకొంది. పొత్తులలో భాగంగా సీట్లను ఖరారు చేస్తూ ప్రకటన వచ్చిన తరువాత నుంచి జిల్లా జనసేనలో అంతులేని నిశ్శబ్దం అలుముకుంది. నిన్న మొన్నటి వరకు ఒంగోలు సీటు తనకే వస్తుందన్న భరోసాతో ఉన్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్‌కు షాక్ తగిలింది. ఐదేళ్లుగా పార్టీని మోస్తూ వచ్చిన ఆయనకు ఒంగోలు సీటుపై చివరి వరకు ఊరిస్తూ వచ్చారు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్. చివరికి మొండిచేయి చూపడంతో రియాజ్ తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే దామచర్ల పేరును ప్రకటించడంతో షాక్‌కు గురైన రియాజ్ రెండు రోజులుగా ఫోన్ స్విచాఫ్ చేసి పార్టీ కార్యకర్తలకు అందుబాటులో లేకుండా పోయారు. జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణకు దామచర్ల మద్దతుగా ఉంటున్నారన్న వార్తలు ఉన్నాయి. సీట్ల ప్రకటన తర్వాత ఆమె దామచర్ల ఇంటికి వెళ్లి మరీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేయడం రియాజ్ వర్గం జీర్ణించుకోలేకపోతోంది. దీంతో ఇరు వర్గాల మధ్య సోషల్ మీడియాలో వార్ మొదలైంది. అరుణ తీరును తప్పుపడుతూ రియాజ్ వర్గం నాదెండ్ల మనోహర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అరుణను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, లేకపోతే పార్టీకి తీరని నష్టం జరుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ విషయం బహిర్గతం కావడంతో అరుణ వర్గం ఎదురు దాడి ప్రారంభించింది. ఒకరి మీద మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం వెనక దామచర్ల హస్తం ఉన్నట్లు కొందరు జనసైనికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మొదట్నుంచి దామచర్ల జనసైనికులను పట్టించుకోవడం లేదు. అనేకమార్లు అవమానించిన ఘటనలు ఉన్నాయి. పార్టీ కార్యక్రమాలకు సైతం నామమాత్రంగా పిలవడమే కాకుండా అసలు ఏమాత్రం విలువివ్వక పోవడంతో పలువురు జనసేన కార్యకర్తలు తెలుగుదేశం మీటింగులకు దూరంగా ఉంటున్నారు. ఆ మధ్య ఒంగోలులోని ఒక హోటల్‌లో జరిగిన తెలుగుదేశం, జనసేన సమన్వయ సమావేశానికి కూడా జనసేన కార్యకర్తలు, నాయకులు నామమాత్రంగా హాజరయ్యారు. వారి కోసం కేటాయించిన కుర్చీలను లాక్కొని టీడీపీ నాయకులు కూర్చోవడంతో సమావేశానికి వెళ్లిన వారు సైతం త్వరగా బయటపడ్డారు. అంతేకాకుండా జనసేనలో దామచర్ల వర్గాలను ప్రోత్సహిస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ఇటీవల జనసేన పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు ఇక్కడ ఇమడలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒంగోలు సీటు ఆశించిన ఆయన జనసేనకు అంతసీను లేకపోవడాన్ని గమనించి పోటీ నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది.

ఒంగోలు పరిస్థితి ఇలా ఉండగా గిద్దలూరు జనసేనలోనూ దామచర్ల తలదూర్చి గందరగోళ పరిస్థితులు సృష్టించినట్లు తెలుస్తోంది. ఇక్కడ నుంచి తాను పోటీ చేస్తున్నట్టు రెండు నెలల ముందే ఆమంచి స్వాములు ప్రకటించుకున్నారు. అయితే ఆయనకు సీటు దక్కకుండా పిడతల సాయికల్పనను దామచర్ల రంగంలోకి దించినట్లు సమాచారం. ఆమె ప్రస్తుతం టీడీపీలో ఉన్నారు. రెండు మూడు రోజుల్లో టీడీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పవన్ కళ్యాణ్‌ను కలిసి తనకు గిద్దలూరు సీటు ఇవ్వాలని పిడతల సాయికల్పన కోరినట్లు సమాచారం. దీని వెనుక కథ అంతా దామచర్ల నడిపినట్టు విశ్వసనీయ సమాచారం. గిద్దలూరు జనసేన రాజకీయాన్ని దామచర్ల తనదైన శైలిలో శాసించేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇక మార్కాపురం సీటు తనకు ఇవ్వాలని జనసేన నేత ఇమ్మడి కాశీ విశ్వనాథ్ పట్టుబడుతున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో ఆయన జనసేన నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. పార్టీ కోసం రూ.లక్షలు ఖర్చు చేశాను..మార్కాపురం నియోజకవర్గంలో పాదయాత్రలు చేశా.. పార్టీ అభివృద్ధికి కృషి చేశా.. ఇప్పుడు తన పరిస్థితి ఏమిటని ఆయన అధిష్టానాన్ని నిలదీస్తున్నట్టు తెలుస్తోంది.

జనసేన మొదట్నుంచి దర్శి సీటును కోరుకుంటోందని ప్రచారం జరిగింది. దీనిని కూడా దామచర్ల వర్గం ప్రచారం చేసిందని తెలిసింది. దానికి తగ్గట్టే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్న గరికపాటి వెంకట్‌ను జనసేనలోకి చేర్పించడం, ఆయన దర్శిలో కొంతకాలం కార్యకలాపాలు నిర్వహించడం జరిగింది. మీడియాలో సైతం పెద్ద ఎత్తున ప్రచారం చేసిన ఆయన అకస్మాత్తుగా సైలెంట్ అయిపోయారు. ఇప్పుడు దర్శిలో టీడీపీ పోటీ చేయనున్నట్లు ప్రచారం మొదలైంది. ఇటీవలే టీడీపీలో చేరిన కృష్ణ చైతన్యను దర్శికి వెళ్లాల్సిందిగా చంద్రబాబు సూచించినట్లు వార్తలొచ్చాయి. దీంతో జనసేన లిస్టు నుంచి దర్శి కూడా ఔట్ అయింది. మొదట్నుంచి ప్రకాశం జిల్లా నుంచి 2 లేదా 3 సీట్లు జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. ఒంగోలు సీటు అన్నారు.. దర్శి అన్నారు.. గిద్దలూరు అన్నారు.. తీరా చూస్తే కనీసం ఒక సీటైన ఇస్తారా లేదా అని జనసేన కార్యకర్తలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

**త్వరలోనే దుకాణం బంద్..**

జిల్లాలో జనసేన పార్టీ పోటీ చేయడం కూడా అనుమానంగా మారిన పరిస్థితుల్లో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని నిర్వహించడం ఎందుకని రియాజ్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. 2 నెలలుగా అద్దె కూడా చెల్లించలేదని, దాంతో భవన యజమాని ఒత్తిడి ఎక్కువైందని తెలుస్తోంది. ఈ తలనొప్పి కంటే పార్టీ కార్యాలయాన్ని ఎత్తివేస్తే సరిపోతుంది కదా అని కొందరు శ్రేయోభిలాషుల సూచన మేరకు త్వరలోనే దుకాణం బంద్ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా నగరంలో పార్టీ తరఫున ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించిన వీర మహిళలు కూడా రెండు రోజులుగా కార్యక్రమాన్ని ఆపేశారు.

### శనగలు మద్దతు ధరకు కొనుగోలు

- జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులు పండించిన శనగలను కనీస మద్దతు ధరకు నాఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా గుర్తించినట్లు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శనగల కనీస మద్దతు ధర రూ.5,440గా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులు శనగ పంటను అమ్ముకునేందుకు కంటిన్యూస్ మానిటరింగ్ ఆఫ్ అగ్రికల్చర్ ప్రైస్ అండ్ ప్రొడక్ట్ (సీఎం యాప్) లో మంగళవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు సమయంలో పంట నూర్పిడి తేదీ కూడా నమోదు చేసుకోవాలని చెప్పారు. తాము సరుకు అమ్ముకునే తేదీ రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు సమాచారం వస్తుందన్నారు. అమ్ముకునే సమయంలో తప్పనిసరిగా ఆధార్‌లో లింక్ అయిన మొబైల్ నంబర్ మాత్రమే ఇవ్వాలని చెప్పారు. అలా లేనట్లయితే సరిచేయించుకోవాలని, లేదంటే చెల్లింపులు జరిగే అవకాశం లేదని చెప్పారు. రైతులు తమ పంటను శుభ్ర పరచుకుని, ఆరబెట్టుకుని 14 శాతం లోపు తేమ శాతం ఉండి ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలతో ఉండేలా చూసుకోవాలని చెప్పారు.

### విశ్వకర్మ పెండింగ్ దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి

ఒంగోలు అర్బన్: పీఎం విశ్వకర్మ పథకంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను మార్చి 4వ తేదీలోపు పరిష్కరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. పీఎం విశ్వకర్మ దరఖాస్తులు గ్రామ సర్పంచ్‌ల లాగిన్‌లలో పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఎంఎస్ఎంఈ సర్వేలు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలతో ప్రభుత్వ నిర్దేశకాల మేరకు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 91 వేల యూనిట్‌లు ఉండగా 590 మందితో ఈ సర్వే నిర్వహించాలని, అందుకు తగిన ప్రణాళిక రూపొందించాలని చెప్పారు.

# జవాబుదారీతనంతో పాలన

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్



పాతసింగరాయకొండ పంచాయతీలో ఆర్‌బీకే ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

సింగరాయకొండ (మర్రిపూడి): జవాబుదారీతనం, పారదర్శకత, నిజాయతీ, నిబద్ధత గల ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండ పంచాయతీలో సోమవారం మధ్యాహ్నం సుమారు రూ.90 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ల వలన పరిపాలనను గ్రామస్థాయికి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చాలా రాష్ట్రాలు మన సచివాలయ, ఆర్‌బీకే వ్యవస్థను పరిశీలించి ఆయా రాష్ట్రాల్లో ఈ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారని.. ఇలా జగనన్న తన పరిపాలనతో దేశంలోని అన్ని రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా మారారని కొనియాడారు. గతంలో గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు పాత భవనాల్లో ఉండేవని, కూర్చోవటానికి కూడా వసతులు ఉండేవి కావన్నారు. చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయని, కొన్ని గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యాలయం తెరిచే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. జగనన్న పంచాయతీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి గ్రామ స్థాయిలో లక్షలాది రూపాయలతో గ్రామ సచివాలయాలు నిర్మించారని గుర్తు చేశారు. గతంలో ఎరువులు, విత్తనాల కోసం మండల కార్యాలయాల



అయ్యప్పనగర్‌లో గ్రామ సచివాలయం ప్రారంభోత్సవంలో మంత్రి సురేష్

చుట్టూ తిరిగే వారని కానీ ప్రస్తుతం గ్రామస్థాయిలోనే ఆర్‌బీకే ల ద్వారా నాణ్యమైనవి లభిస్తున్నాయని చెప్పారు. వైద్య రంగంలో కూడా సమూల మార్పులు చేశారని, గ్రామ స్థాయిలో హెల్త్ సెంటర్ ను నిర్మించి నైపుణ్యం ఉన్న ఒక ఎమ్ఎల్‌హెచ్‌పీని నియమించారని చిన్న చిన్న రోగాలకు ఇక్కడే చికిత్స చేయించడంతో పాటు పలు రకాల పరీక్షలు చేస్తారని వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన కర్తవ్యమని వివరించారు. అంతకుముందు పాతసింగరాయకొండ శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మంత్రి సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, సర్పంచ్ వల్లూరి రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ ఝాన్సీ, గాలి బుజ్జి, చిమట తాతయ్య, చల్లా బ్రహ్మారావు, గాలి బాలాజీ, చిమట శ్రీను, చిమట సుధాకర్, పంచాయతీరాజ్ డీఈ రవిబాబు, ఏఈ కోట శ్రీహరి, చీదెళ్ల నరసింహారావు, బొట్టా కోటేశ్వరరావు, చిమట కోటేశ్వరరావు, చిమట సుబ్బారావు, పిగిలి చిన నరసింహ, గాలి నరసింహారావు, దాసరి శేషయ్య, సాయికోటి, మద్దసాని శ్రీహరి, కొట్టే జాలయ్య, మసనం వెంకట్రావు, చిడిపూడి కృష్ణారెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ‘సిద్ధం’ సభకు భారీగా తరలిరావాలి



సిద్ధం సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మేరుగు నాగార్జునతో నాయకులు

- మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చి 3వ తేదీన మేదరమెట్ల వద్ద తలపెట్టిన సిద్ధం సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మద్దిపాడు మండల వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ కార్యకర్తలు అభిమానులు, నాయకులు తరలి రావాలని కోరారు. మొదట జరిగిన రెండు సభలకంటే రాప్తాడులో సభ భారీగా జరిగిందని, దానిని మించి మేదరమెట్ల వద్ద జరగబోయే సభను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంఘీభావం తెలుపుతూ ఏర్పాటు చేస్తున్న చివరి సిద్ధం సభ ఇది అన్నారు. అనంతరం ‘సిద్ధం’ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీలు మోరబోయిన విజయలక్ష్మి, పైడిపాటి వెంకట్రావు, కోఆప్షన్ మెంబర్ మూసా, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఓబుల రెడ్డి, మోరబోయిన సంజీవరావు, గట్టినేని అయ్యన్న, కన్నెబోయిన వెంకటాద్రి, బాల చంద్రమౌళి, బాలాంజనేయరెడ్డి, పోతినేని శ్రీనివాసరావు, తేళ్ల పుల్లారావు, రాయపాటి రమేష్, మద్దా లక్ష్మీనారాయణ, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి, తిప్పారెడ్డి కోటిరెడ్డి సుధాకర్, వినోద్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# ఇంటర్, పది పరీక్షలకు సర్వం సిద్ధం

- మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు
- మార్చి 18 నుంచి 30 వరకు పది పరీక్షలు
- జిల్లాలో సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకున్నాం
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ దినేష్‌కుమార్



కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఇంటర్మీడియెట్, పదో తరగతి, ఓపెన్ స్కూలు పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసి యంత్రాంగాన్ని సిద్ధం చేశామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం ప్రకాశం భవనంలో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు, తీసుకుంటున్న చర్యలపై విలేకరుల సమావేశం నిర్వహించి వివరించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకు 44,733 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. అందులో మొదటి సంవత్సరం 21,570 మంది, రెండో సంవత్సరం 23,163 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఇంటర్ పరీక్షల కోసం జిల్లాలో 69 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటిలో 5 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్లు గుర్తించి ప్రత్యేక నిఘాతో పాటు అదనపు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. ఇంటర్ పరీక్షలకు 69 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 69 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 23 మంది కస్టోడియన్‌లు, 43 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించినట్లు వివరించారు. ఆదేవిధంగా 3 సిట్టింగ్, 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

- పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 29,449 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. రెగ్యులర్ పరీక్షలకు 14,800 మంది బాలురు, 14,649 మంది బాలికలు హాజరవుతున్నట్లు చెప్పారు. సప్లిమెంటరీ పరీక్షలకు 798 మంది బాలురు, 681 మంది బాలికలు హాజరవుతున్నారని వివరించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 170 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో 6 సమస్యాత్మక పరీక్ష కేంద్రాలుగా గుర్తించామన్నారు. అక్కడ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.
- ఓపెన్ స్కూలు పరీక్షలు మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పరీక్షలకు 1660 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 5258 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు.
- ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు 25 పరీక్ష కేంద్రాలు, పదో తరగతి పరీక్షలకు 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు.
- ఈ నెల 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించామని, పూర్తి స్థాయిలో బందోబస్తు కూడా ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ బస్సులు కూడా అదనంగా నడుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్ఐఓ సైమన్ విక్టర్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి శ్రీనివాసరావు, డీఈఓ సుభద్ర పాల్గొన్నారు.

# ప్రతి అర్జీ పరిష్కారం కావాలి

- నిర్దిష్ట వ్యవధిలో క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి
- ‘స్పందన’ నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్



స్పందనలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీ తాలూకు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి ఫోన్ ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసేలా పరిష్కరించాలన్నారు. అర్జీలను నిర్ణీత కాల పరిమితితో పాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించలేని సమస్యలను అర్జీదారులకు వివరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మాధురి, ఝాన్సీలక్ష్మి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- కంభం నుంచి హైమతుల్లా డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తన ఇంటి నంబర్ 2-102(ఏ)కు సంబంధించిన భూమిని ఆక్రమించి భవనం నిర్మించారని, ఎటువంటి పత్రాలు లేకుండా ఆక్రమించి భవనం నిర్మిస్తే ఇంటి పన్ను కూడా కేటాయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై డీపీఓ విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.
- ముండ్లమూరు మండలం వేంపాడు గ్రామానికి చెందిన హనుమంతరావు సర్వే నంబర్26/10లో ఉన్న తన భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో పేరును తొలగించారని పరిశీలించి తన పేరును ఆన్‌లైన్ చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.
- టంగుటూరుకు చెందిన కట్టా కొండమ్మ స్పందనలో అధికారులను కలిసి తనకు 2018 నుంచి వృద్ధాప్య పింఛన్ వస్తుందని, అయితే రెండేళ్ల క్రితం తన పింఛన్ నిలుపుదల చేశారని, కారణాలు కూడా అధికారులు తెలపడం లేదని అర్జీ అందజేశారు. పరిశీలించి పింఛన్ ఇప్పించాలని కోరారు.

## రైల్వే అభివృద్ధి పనులు జాతికి అంకితం

- రూ.11.60 కోట్లతో మార్కాపురం రైల్వేస్టేషన్ అభివృద్ధి
- ఉప్పుగుండూరు–పెదగంజాం మధ్య రైల్వే అండర్ పాస్
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ



మార్కాపురం స్టేషన్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులతో రైల్వే అధికారులు

**మార్కాపురం రూరల్:** అమృత్ భారత్ స్కీమ్ కింద మార్కాపురం రైల్వేస్టేషన్‌లో రూ.11.60 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సోమవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ ఆవరణలో చిన్నారులతో రైల్వేశాఖ అధికారులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రధాని మోడీ అన్ని రంగాలను అభివృద్ధి పథంలో నడుపుతున్నారని పేర్కొన్నారు, రైల్వే శాఖను ఆధునీకరించి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారని చెప్పారు. రైల్వేశాఖ సీనియర్ డీఓఎం దినేష్‌కుమార్ మాట్లాడుతూ మార్కాపురం రైల్వేస్టేషన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. స్టేషన్‌లోని ప్రయాణికుల ప్రాంగణం, ట్రాఫిక్ వసతులు, వెయిటింగ్ హాలు, ఎల్‌ఈడీ సైన్‌బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్టేషన్ సూపరింటెండెంట్ జనార్దన్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

**అందుబాటులోకి అండర్ పాస్**

**నాగులుప్పలపాడు:** ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం మహత్తరంగా పనిచేస్తోందని రైల్వే శాఖ ఏడీఈ ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అమృత్ భారత్ స్కీమ్‌లో భాగంగా ఉప్పుగుండూరు–పెదగంజాం మధ్య నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని దేశ ప్రధాని మోడీ వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు, ప్రజలు పాల్గొని ప్రధాని ప్రసంగాన్ని తిలకించారు. కార్యక్రమంలో మాదాసు రాంబాబు, కొంజేటి సురేష్, ఎల్,టీగ్రా, పొద వరప్రసాద్, పెంట్యాల శ్రీను రైల్వే సిబ్బంది జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌జీఓ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం




షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు అన్నా, కేపీ, సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, బండి శ్రీనివాసరావు

**మార్కాపురం:** ఉద్యోగుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. సోమవారం మార్కాపురంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీ ఎన్‌జీఓ హోమ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమనగంటి శ్రీరాములు షాపింగ్ కాంప్లెక్స్ హాల్‌ను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ.. ఉద్యోగులకు తన మనసులో ప్రత్యేక స్థానం ఉందని, సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఉద్యోగులు తన విజయానికి సహకరించాలని ఎమ్మెల్యే అన్నా విజ్ఞప్తి చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో ప్రభుత్వ ఉద్యోగుల సహకారాన్ని తాను ఎప్పటికీ మరువనన్నారు. ఎన్‌జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు, రాష్ట్ర కోశాధికారి రంగారావు, మార్కాపురం అధ్యక్ష్య కార్యదర్శులు డాక్టర్ బీవీ శ్రీనివాస శాస్త్రి, వి.శ్రీనివాస్, కౌన్సిలర్ సలీమ్, ఎన్‌జీఓ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జి.హరిహరరావు, మహిళా విభాగం ప్రతినిధి మాధవి తదితరులు పాల్గొన్నారు.



# కట్టుదిట్టంగా పది పరీక్షలు

- నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

**ఒంగోలు:** పదో తరగతి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశమందిరంలో సోమవారం పది పరీక్షల నిర్వహణకు నియమితులైన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు హాజరవుతున్నందున విద్యార్థులలో పరీక్షల వ్యవస్థపై విశ్వాసం కలిగేలా పరీక్షల నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. పరీక్షలు లోప రహితంగా నిర్వహించడం ద్వారా మాత్రమే భవిష్యత్‌పై విద్యార్థులకు విశ్వాసం కలుగుతుందన్నారు. పోటీ ప్రపంచంలో ఏ విధంగా [illegible] వారితో అవగాహన వస్తుందన్నారు. పరీక్షల విధుల్లో పాల్గొను సిబ్బందికి [illegible] నిర్దేశించిన మార్గదర్శ[illegible] పూర్తి అవగాహన కలి[illegible] ఉండాలన్నారు. [illegible] కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను పర్యవేక్షించాల్సిన బాధ్యత వీరిపై ఉంటుందన్నారు. పదో తరగతి పరీక్షలకు 20 రోజులు మాత్రమే గడువు ఉందని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యమైన అంశాల పునశ్చరణ, ప్రశ్నాపత్రాన్ని అర్థం చేసుకుని వాటికి తగినట్లుగా సమాధానం రాయడంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రకాశం జిల్లా నుంచి అత్యధిక మంది టాపర్స్ ఉండేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఈ దిశగా జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిసేలా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే భవిష్యత్ దెబ్బతింటుందని, చట్టపరమైన చర్యలను కూడా ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్పెషల్ అబ్జర్వర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ గత ఏడాది పబ్లిక్ పరీక్షలను సమర్థవంతంగా జిల్లా యంత్రాంగం నిర్వహించిందన్నారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా నిర్వహించి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ బి.సుభద్ర, డిప్యూటీ డీఈఓ అనితారోజ్ రాణి, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి వై.వెంకట్రావు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

## నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.22.30 లక్షలు



హుండీ కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

**సీఎస్‌పురం (పామూరు):** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయలో ప్రధాన హుండీ ఆదాయం గత 152 రోజులకు రూ.22,30,423 వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ తెలిపారు. నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో చదలవాడ గ్రూప్ దేవస్థానాల ఈఓ అనీల్‌కుమార్, నారాయణస్వామి ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో ప్రధాన హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 152 రోజుల హుండీ ఆదాయం లెక్కించామన్నారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకటరావు, ముడుమాల నారాయణరెడ్డి, పాలపర్తి నారాయణ రావు, అర్చకులు మంకాల సత్యనారాయణ, మంకాల శివప్రసాద్‌శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వల్లూరమ్మ ఆలయ ఆదాయం రూ. 26.19 లక్షలు



ఆలయంలో కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

**టంగుటూరు:** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో హుండీలను సోమవారం దేవదయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు సమక్షంలో లెక్కించారు. మొత్తం 152 రోజులకుగాను 10 హుండీలు లెక్కించగా రూ.26, 19,452 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో బి.రమేష్ వెల్లడించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమాశంభర్, ధర్మకర్తల మండలి సభ్యులు, సేవా సంఘం భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి అండగా ఉంటా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో భారీగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా నా కుటుంబ సభ్యులే
- గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

**బేస్తవారిపేట:** వైఎస్సార్ సీపీలో ప్రతి నాయకుడు, కార్యకర్తను నా సొంత కుటుంబసభ్యుడిగానే భావిస్తున్నానని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం బేస్తవారిపేట మండల వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి న్యాయం చేయడంతోనే ధైర్యంగా ఓడు అడుగుతున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ అంటే నమ్మకం, శక్తి, ధైర్యాన్ని ఇచ్చారన్నారు. ఇంటివద్దకే పాలన, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు, కుల, మతాలకు అతీతంగా సేవలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. ప్రతి సమస్యలో భాగమై మీతో పాటు నడుస్తానని తెలిపారు. సీఎం నాకు ధైర్యాన్ని ఇచ్చి నియోజకవర్గానికి పంపించారన్నారు. దేశానికి సేవ చేసే సైనికులు, మాజీ సైనికులు గిద్దలూరు నియోజకవర్గంలో ఎక్కువ శాతం ఉన్నారని, వారికి సేవ చేసుకునే అవకాశం రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి సమస్య నా సమస్యగా భావించి పరిష్కరించేందుకు ముందుంటానని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కుటుంబంలో చిన్న చిన్న కలహాలు వదిలిపెట్టి కలిసికట్టుగా పార్టీ విజయం కోసం కష్టపడుదామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం వైఎస్ కుటుంబం పాటుపడుతుందన్నారు. చంద్రబాబు రైతు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని మోసం చేశాడన్నారు. చంద్రబాబుకు హామీలు ఇవ్వడమేకాని నెరవేర్చడం తెలియదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, మాజీ ఎంపీపీ పి.వెంకటరాజు, మాజీ జెడ్పీటీసీలు తాతపూడి ఐజయ్య, చిలకల జయమ్మ, జేఏసీ చైర్మన్ టీవీఎస్పీ శర్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొండా రఘునాథరెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు గుంటి స్వప్న, డీ ఖాజామీయా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగనన్న పాలనలో రోజూ పండగే..



డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా

- సంక్షేమం కొనసాగేందుకు మళ్లీ జగనన్నను గెలిపిద్దాం
- వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు
- కొనకనమిట్ల మండలంలో వైఎస్సార్ ఆసరా నిధుల పంపిణీ
- 846 డ్వాక్రా సంఘాల మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.7.65 కోట్లు జమ

**కొనకనమిట్ల:** సీఎం వైఎస్ జగనన్న పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతూ రోజూ పండగలాగే ఉంటోందని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పాలన సాగిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. సోమవారం కొనకనమిట్లలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా 4వ విడత చెక్కును మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డితో కలిసి ఎమ్మెల్యే అన్నా అందజేశారు. మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి పథకంలో అక్కచెల్లెమ్మలకే పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ మహిళల సంక్షేమానికి జగనన్న కృషి చేశారన్నారు. పథకాలు పొందిన మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ముందుగా ఏపీఎం కర్నాటి గోపాలకృష్ణారెడ్డి పర్యవేక్షణలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాల కేక్ కట్ చేశారు. 846 పొదుపు సంఘాలకు రూ.7.65 కోట్ల చెక్కు పంపిణీ చేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు యంబాడి ఈశ్వరమ్మ ప్రభుత్వ పనితీరుపై పాటలు పాడి అలరించారు.

**ఎమ్మెల్యేకు ఘన స్వాగతం**

తొలుత ఎమ్మెల్యే అన్నాకు ఎంపీపీ మోరబోయిన మురళీ కృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీలు మెట్టు వెంకటరెడ్డి, గొంగటి జెనీఫా, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవంకటరెడ్డి ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా వచ్చి బస్టాండ్ సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం కార్యదర్శి ఏలూరి సంజీవరెడ్డి, సీసీకెఆర్ శ్రీను, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు గోనుగుంట్ల శ్రీనివాసులు, గర్రె శ్రీనివాసులు, స్థానిక సర్పంచ్ శిగినం లక్ష్మి తిరుపతమ్మ కొండయ్య, ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ దిబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ పునుగోటి కొండారెడ్డి, ఎస్సీసెల్ కార్యదర్శి చిరుగూరి కోటేశ్వరరావు, బీసీసెల్ నాయకులు పావులూరి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల కమిటీ అధ్యక్షులు నుసుం బాలచంద్రుడు, అన్నీ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మహిళా సమాఖ్య సభ్యులు, పొదుపు సంఘాల మహిళలు, సీసీలు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం

- ఎస్పీ పరమేశ్వరరెడ్డి
- ఎస్పీ స్పందనకు 82 ఫిర్యాదులు



అర్జీ పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

**ఒంగోలు సబర్బన్:** స్పందన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేసి సత్వరమే న్యాయం అందేలా చూడాలని జిల్లాలోని పోలీస్ అధికారులకు ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి సూచించారు. గెలాక్సీ భవన్‌లో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి దాదాపు 82 ఫిర్యాదులు అందాయి. అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా వచ్చి ఫిర్యాదులు చేయాలని సూచించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని, సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారానే సూచనలు చేసి ప్రతి ఒక్కరికీ న్యాయం అందేలా చూడాలని ఆదేశించారు. స్పందనలో కుటుంబ కలహాలు, భర్త, అత్తింటివారి వేధింపులు, భూ వివాదాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలు చేయటంతో పాటు ఇతర సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని కనిగిరి మండలానికి చెందిన ఒక మహిళ రూ.8.25 లక్షలు తీసుకొని బంగారం ఇవ్వకపోగా డబ్బులు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుందని ఒక ఫిర్యాదుదారు తన గోడు వెళ్లబోసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తాళ్లూరు మండలానికి చెందిన షరీఫ్ అనే వ్యక్తి రూ.50 వేలు తీసుకున్నట్లు మరొకరు కూడా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు, దిశ డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

- ఎస్పీ పరమేశ్వరరెడ్డి



కనిగిరి డీఎస్పీ ఆఫీసులో ఎస్పీ పరమేశ్వరరెడ్డి

**కనిగిరి రూరల్:** సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ పరమేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కనిగిరి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమేనని, దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. గత ఎన్నికల్లో ఎక్కడెక్కడ సమస్యలు ఉత్పన్నమయ్యాయో, అక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై సిబ్బందితో చర్చించామన్నారు. కనిగిరి నియోజకవర్గంలో 19 సమస్యాల కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని ఎన్నికల విధుల్లో ఉంచుతామన్నారు. కనిగిరిలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించామన్నారు. మున్సిపల్, రెవెన్యూ సహకారంతోనే ట్రాఫిక్ సమస్యకు శాశ్వతంగా పరిష్కారం ఉంటుందని, ఇతర శాఖల సమన్వయంతో పరిష్కారిస్తామన్నారు. పట్టణంలో ఉన్న పోలీస్ సీసీ కెమెరాలతో పాటు వివిధ దుకాణాల వద్ద, షాపుల వద్ద ఉన్న సీసీ కెమెరాలను కూడా పగలు రాత్రి పూర్తి స్థాయిలో వినియోగంలో ఉంచాలని తెలిపారు. తొలుత కనిగిరి డీఎస్పీ కార్యాలయ పరిధిలోని పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, పలు అంశాలపై చర్చించి, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విషయాలపై దిశ నిర్దేశం చేశారు. అనంతరం పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఆఫీసు ఆవరణలో మొక్కలు నాటారు. డీఎస్పీ ఆర్ రామరాజు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# జగనన్నతోనే సంక్షేమ రాజ్యం

- వైఎస్సార్ సీపీ దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి



వైఎస్సార్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

**తాళ్లూరు(దర్శి):** సంక్షేమ రాజ్యం కొనసాగేందుకు రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. 'మన ఊరికి మన శివన్న' కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి తాళ్లూరు మండలంలోని వెలుగువారిపాలెం, అయ్యలపాలెం, రెడ్డిసాగర్ గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బూచేపల్లి కుటుంబ సభ్యులను పార్టీ నేతలు గజమాలలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. వైఎస్సార్ విగ్రహానికి బూచేపల్లి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వెలుగువారి పాలెంలో రూ.15 లక్షలతో నిర్మించిన రెండు సైడు కాల్వలు, రూ.5 లక్షల సీసీ రోడ్డు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, జగనన్న పాల వెల్లువ భవనాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలోనూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు అధికారంలో ఉన్నపుడు జన్మభూమి కమిటీలతో పేదల సొమ్ము దోచుకుతిన్నారని విమర్శించారు. 'మీకు మేలు జరిగితేనే నాకు ఓటు వేయండి' అని ఓటు అడిగే దమ్మున్న నాయకుడు ఒక వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. చంద్రబాబు రాష్ట్రానికి చేసిందేమీ లేక పొత్తుల కోసం పాకులాడుతున్నాడని విమర్శించారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ.. రాజన్న ఆశయాలు కొనసాగించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బూచేపల్లి సుబ్బారెడ్డి ఆశయాలు కొనసాగించేందుకు శివప్రసాదరెడ్డి కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు. వెలుగువారి పాలెం గ్రామం తమ పుట్టిల్లు లాంటిదన్నారు. దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద రెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డిని అధిక మెజార్టీతో గెలుపించాలని కోరారు.

కార్యక్రమాల్లో మండల ఇన్‌చార్జి మద్దిరెడ్డి నరసింహారెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎం బాషా, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు తూము వెంకటసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీలు ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు పాలెం నాగలక్ష్మి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, వెలుగువారిపాలెం సర్పంచ్ ముచ్చుమారి కోటేశ్వరమ్మ, సచివాలయ కన్వీనర్ బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీ మూలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ మూలంరెడ్డి ఓబుల్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, చిన్నపురెడ్డి రామకోటిరెడ్డి, యర్రారెడ్డి, వెంకటరెడ్డి, తాళ్లూరు సర్పంచ్ చార్లెస్ సర్జన్, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదనరెడ్డి, గోళ్లపాటి మోషే, కోటా రామిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు పులి ప్రసాదరెడ్డి, పులి అంజిరెడ్డి, లక్కవరం సర్పంచ్ వెంకటేశ్వర్లు, గంగవరం సర్పంచ్ ఇమ్మానియేలు, దోసకాయలపాడు సర్పంచ్ కోటా వెంకటరామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా యూత్ వింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం జాయింట్ సెక్రటరీ విష్ణు, జక్కుల రామకృష్ణ, గువ్వల వెంకటశ్రీనివాసరెడ్డి, గుజ్జుల యోగిరెడ్డి, సంగు కొండారెడ్డి, మేకల కొండయ్య, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ తూము శివశంకరరెడ్డి, పి.దేవదానం పాల్గొన్నారు.

## లైంగిక దాడి కేసులో రిమాండ్

**పామూరు:** వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. మండలంలోని పోతవరంలో ఈనెల 21న వృద్ధురాలు చెనికల ఆదెమ్మపై ఆమె ఇంటికి సమీపంలో నివసిస్తున్న చెనికల మల్లికార్జున మద్యం మత్తులో లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఎం రామానాయక్ ఆధ్వర్యంలో మల్లికార్జునపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితుడిని అరెస్ట్ చేసి కనిగిరి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించడంతో దర్శి జైలుకు తరలించినట్లు సీఐ రామానాయక్ పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**కనిగిరి రూరల్:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గార్లపేట రోడ్డులోని బృందావన కాలనీ సమీపంలో నివసిస్తున్న పోలా వెంకటేశ్వర్లు(39) కనిగిరి నుంచి ఇంటికి మోటార్ బైక్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో పునుగోడు నుంచి కనిగిరి వైపు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. పోలా వెంకటేశ్వర్లు తలకు బలమైన గాయాలై, కాళ్లు విరిగి తీవ్ర గాయలయ్యాయి. క్షతగాత్రున్ని స్థానిక వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు కలరు. ఎస్సై త్యాగరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.